సాక్షి జగిత్యాల

గురువారం । 3 । ఆగస్టు । 2023



తల్లిపాలు శ్రేష్ఠం

జగిత్యాలరూరల్: తల్లిపాలు శ్రేష్ఠమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జానకి అన్నారు. లక్ష్మీపూర్‌లో తల్లిపాల వారోత్సవాలు జరిపారు.



చెవిలో పూలతో నిరసన

మెట్‌పల్లి : తమ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో పంచాయతీ కార్మికులు చెవిలో పూలు పెట్టుకుని నిరసన తెలిపారు.

గరిష్ఠం/కనిష్ఠం
30.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురు గాలులు వీస్తాయి. అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మొక్కల సంరక్షణపై దృష్టి



మొక్క నాటుతున్న కలెక్టర్ యాస్మిన్‌బాషా

జగిత్యాలరూరల్: హరితహారం మొక్కల సంరక్షణపై దృష్టి సారించాలని కలెక్టర్ యాస్మిన్ బాషా సూచించారు. పొలాస గ్రామంలో బుధవారం హరితహారంలో భాగంగా మొక్కలు నాటి మాట్లాడారు. రోడ్డుకు ఇరువైపులా నాటే అవెన్యూ ప్లాంటేషన్‌లో మొక్కల ఎదుగుదలకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ నరేశ్, ఎంపీడీవో రాజేశ్వరి, ఎంపీవో రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

చెరువులకు మరమ్మతు



కొచ్చెరువును పరిశీలిస్తున్న అధికారులు

కథలాపూర్(వేములవాడ): వర్షాలతో తెగిన చెరువులను వీలైనంత త్వరగా మరమ్మతు చేస్తామని నీటిపారుదల శాఖ కరీంనగర్ ఈఎన్‌సీ శంకర్ అన్నారు. గంభీర్‌పూర్ కొచ్చెరువు, బొమ్మెన ప్రాజెక్టు, బీమారం మండలం రాజలింగంపేట శివారు గోవిందరాజుల చెరువు, రంగాపూర్ ప్రాజెక్టును ఆయన బుధవారం పరిశీలించారు. వర్షాలతో చెరువులకు భారీనష్టం జరిగిందన్నారు. వీటితోపాటు కాలువలను త్వరగా మరమ్మతు చేయించాలని అధికారులకు సూచించామని తెలిపారు. కబ్జాదారులకు నోటీసులు జారీచేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఈఈ అమరేందర్‌రెడ్డి, డీఈ ప్రశాంత్, ఎంపీపీ జవ్వాజి రేవతి, ఏఈ శ్రీనివాస్, రాజు, సర్పంచులు పోతు సింధూజ, ఎంజీ రెడ్డి, శేఖర్ తదితరులు ఉన్నారు.

ప్రణాళిక ప్రకారం విద్యాబోధన



మాట్లాడుతున్న డీఈవో జగన్మోహన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం/మల్లాపూర్(కోరుట్ల): ఉపాధ్యాయులు ప్రణాళిక ప్రకారం విద్యాబోధన చేస్తేనే విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందుతాయని డీఈవో జగన్మోహన్‌రెడ్డి అన్నారు. మల్లాపూర్ మండలం రాఘవపేట, ఇబ్రహీంపట్నంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో బుధవారం చేపట్టిన తొలిమెట్టు శిక్షణ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులతో మాట్లాడారు. పాఠ్యప్రణాళికపై ఉపాధ్యాయులకు అవగాహన అవసరమన్నారు. కృత్యపత్రాల ఆధారంగా విద్యార్థులతో సాధన చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తొలిమెట్టు నోడల్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లు గణేశ్, నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

4 నుంచి సదరం శిబిరాలు

జగిత్యాల: స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఈనెల 4, 9, 18, 23, 29 తేదీల్లో సదరం శిబిరాలు నిర్వహించనున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ రాములు బుధవారం తెలిపారు. సదరం సర్టిఫికెట్ల కాలపరిమితి ముగిసినందున మీసేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఆ తర్వాత స్లాట్ బుక్ రసీదు, ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్ కాలపరిమితి ముగిసినవారు రేషన్‌కార్డు జిరాక్స్‌తో శిబిరాలకు హాజరు కావాలని ఆయన సూచించారు.

వసతుల కల్పనకు రూ.10కోట్లు

మెట్‌పల్లి(కోరుట్ల): పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం రూ.10కోట్లను మంజూరు చేసింది. తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీయూఎఫ్ఐడీసీ) ద్వారా ఈ నిధులను కేటాయించింది. ఈ మేరకు బుధవారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులతో చేపట్టే పనులకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఆయన అధికారులకు సూచించారు.

విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు

జగిత్యాల: నులిపురుగుల నియంత్రణ దినోత్సవం సందర్భంగా గురువారం విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామని డీఎంహెచ్‌వో శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక చొరవ తీసుకుని అందరు పిల్లలకు మాత్రలు వేయించాలని ఆయన సూచించారు.

కాలువలు కబ్జా

శిఖం భూములు ఆక్రమణ

- దర్జాగా అక్రమ నిర్మాణాలు
- జలమయమవుతున్న లోతట్టు ప్రాంతాలు
- అధికారుల పర్యవేక్షణ లోపమే కారణం
- అస్తవ్యస్తంగా పురపాలిక ప్రాంతాలు

సాక్షి ఫోకస్

జగిత్యాల: జిల్లాలోని పలు మున్సిపాలిటీల్లో నాలాలు, డ్రైనేజీలు, శిఖం భూములు కబ్జాకు గురవుతున్నాయి. వర్షపునీరు వెళ్లేదారిలేక లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. ప్రధానంగా జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి బల్దియాల్లో ఈ పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది.



జగిత్యాలలోని ఓ కాలనీలో కబ్జాకు గురైన కాలువ

ధరూర్‌వాగు కబ్జా..

- జిల్లా ఆవిర్భావానికి ముందు ధరూర్ వాగును కొందరు కబ్జా చేశారు. ఇళ్లు, ఇతర నిర్మాణాలు చేపట్టారు.
- స్పందించిన అప్పటి సబ్ కలెక్టర్ శశాంక.. వాగు నక్ష ఆధారంగా అక్రమ కట్టడాలు కూల్చివేయించారు. వాగు పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు.
- కానీ, ప్రస్తుతం వాగు మళ్లీ కబ్జాకు గురవుతోంది.
- దీంతో వాగునీరు, వరద లోతట్టు ప్రాంతాలను ముంచెత్తుతోంది.
- మరోవైపు.. భవానీనగర్, కష్టానగర్, విద్యానగర్, వెంకటాద్రినగర్‌లో నాలాలపైనే షాపులు, నివాసాలు నిర్మించారు.
- దాదాపు 12 అడుగుల వెడల్పుగల కాలువ పరిధి మూడు అడుగులకు తగ్గిపోయింది.
- టవర్‌సర్కిల్ ప్రాంతంలో డ్రైనేజీలపైనే కట్టడాలు నిర్మించారు.
- కాలువలు పూడుకుపోయాయి. మురుగు నీరు వెళ్లే దారిలేక నివాసాలను ముంచెత్తుతోంది.
- విద్యానగర్, కష్టానగర్, మోతెరోడ్డు తదితర ముఖ్యమైన ప్రాంతాల్లో లే అవుట్ లేకుండానే ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు.
- ఈప్రాంతాల్లోని వరదనీరు ఎటూ వెళ్లలేని పరిస్థితి నెలకొంది.
- ఖాళీ స్థలాల్లో నిల్వకావడం, లోతట్టు ప్రాంతాల్లోని జనావాసాల్లోకి చేరడంతో తరచూ సమస్యలు ఎదురవుతున్నాయి.
- కొందరు ఖాళీస్థలాల యజమానులు ప్రహరీలు నిర్మించడంతో వర్షపునీరు వెళ్లే దారులు మూసుకుపోతున్నాయి.

కోరుట్లలో కాలనీలు జలమయం



- కోరుట్ల బల్దియా లోనూ ఆక్రమణలకు హద్దులేకుండా పోతోంది. ఒకప్పుడు ఆదర్శనగర్‌లో ఎఫ్‌టీఎల్ భూమి ఉండేది. కంచర కుంట నుంచి మద్దెల చెరువు వరకు అనుసంధానించి ఉండేది. ఎఫ్‌టీఎల్ భూములు అధికంగా ఉండటంతో అక్కడే ఆదర్శనగర్ కాలనీ ఏర్పడింది. పట్టా భూములు అయినా.. ఎఫ్‌టీఎల్ కావడంతో ఇళ్ల నిర్మాణం చేపట్టరాదని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుత వర్షాలతో కాలనీ ముంపునకు గురవుతోంది. ముఖ్యంగా ప్రకాశంరోడ్డు, ముత్యాలవాడ, గోవింద్‌నగర్‌లోని ఇళ్లను వర్షపునీరు ముంచెత్తుతోంది. ఇక్కడ అధికంగా నాలాలు, డ్రైనేజీలపై నిర్మాణాలు చేపట్టడడంతో ఈ పరిస్థితి తలెత్తింది.

మెట్‌పల్లిలోనూ..

- మెట్‌పల్లి మున్సిపల్ పరిధిలోనూ నాలాలు కబ్జాకు గురవుతున్నాయి. ప్రధానంగా ప్రియదర్శినగర్, కళానగర్, దీన్‌దయాళ్‌నగర్‌తోపాటు, శివారు ప్రాంతాల్లో అత్యధికంగా నాలాలు కబ్జాకు గురి కావడంతో ఇళ్లలోకి నీరు వచ్చి చేరుతోంది. జనాలు ఇబ్బందులు పడుతున్నారు.

పట్టింపులేని అధికారులు..

- ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేటప్పుడు అన్నివివరాలు పరిశీలించాల్సి ఉంది. కానీ, టౌన్‌ప్లానింగ్ అధికారులు లంచాలకు కక్కుర్తిపడి నిబంధనలు అతిక్రమించి ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారనే విమర్శలు ఉన్నాయి. కొందరు ఇంజినీర్ ప్లాన్‌పై బల్దియా నుంచి అనుమతి తీసుకుని, ఆ తర్వాత సమీపంలోని మురుగునీటి కాలువలు, నాలాలపై ఇళ్లు నిర్మించుకున్నారు. దీంతో వర్షపునీరు, మురుగునీరు వెళ్లేదారిలేక ఏటా వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలను ముంచెత్తుతోంది.

నాలాలపై కట్టడాలు



నాలాలను కబ్జాచేసి కట్టడాలు నిర్మించారు. వాటితోనే చిన్నపాటి వర్షాలకే ఇళ్లలోకి వరద వస్తోంది. వెంకటాద్రినగర్‌లో ఇటీవల కురిసిన వర్షాలకు ఇళ్లు మునిగాయి. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

– భరత్‌గౌడ్, వెంకటాద్రినగర్, జగిత్యాల

డ్రైనేజీలు మూసేస్తున్నరు



డ్రైనేజీలపై కప్పులు వేస్తూ పూలమొక్కలు నాటుతున్నరు. పూడిక తీయడం కష్టం మారుతంది. వర్షాలతో డ్రైనేజీలు నిండి రోడ్లపైకి మురుగునీరు వస్తంది. కాలినడకకూ ఇబ్బందిగా మారింది. పైకప్పులను తొలగించాలి.

– కల్యాణ్ చక్రవర్తి, జగిత్యాల

నిర్మాణాలు వద్దు



డ్రైనేజీలపై కట్టడాలు నిర్మించరాదు. ఎంక్రోజ్‌మెంట్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఈవిషయాన్ని మా దృష్టికి తీసుకొస్తే పర్యవేక్షించి తొలగిస్తాం. ప్రతీఒక్కరు బాధ్యతగా డ్రైనేజీలను మూసివేయవద్దు.

– శ్రీనివాస్, టీపీవో, జగిత్యాల

కలుపు కష్టం



ఈ రైతు పేరు కంటె తిరుపతి. వెల్గటూర్ మండలం పాశిగామ స్వగ్రామం. తనకున్న రెండెకరాల్లో ఈసారి పత్తి వేశాడు. ఇప్పటివరకు సుమారు రూ.50 వేల వరకు పెట్టుబడి పెట్టాడు. కొద్దిరోజుల పాటు ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలతో చేనులో నీరు నిలిచింది. గడ్డి అధికంగా పెరిగింది. పత్తి మొక్క ఎదగలేదు. ఏం చేయాలో అన్నదాతకు పాలుపోవడంలేదు.



వెల్గటూర్‌లో ఎదుగుదల లోపించిన పత్తి మొక్కలు

- చేనులో నిలిచిన వర్షపు నీరు
- మొక్కల్లో ఎదుగుదల లోపం
- దిగుబడిపై తీవ్రప్రభావం
- పరేషాన్‌లో పత్తిరైతు

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ఈనెలలో మోస్తరు వర్షం కురవాల్సి ఉంది. కానీ, అనూహ్యంగా ఎడతెరిపిలేకుండా భారీవర్షాలు కురిశాయి. పత్తి చేలలో నీరు నిలిచింది. మొక్కలు నీటిమునిగాయి. ఆకులు పసుపుపచ్చగా మారాయి. మొక్కలు గిడసబారి చనిపోయాయి. నీటి నిల్వలతో నేలలో ఆక్సిజన్ శాతం తగ్గింది. వేర్లకు సూక్ష్మజీవుల నుంచి విడుదలైన విషపూరిత వాయువులు అధికంగా చేరి పంటకు నష్టం వాటిల్లింది. అంతేకాదు.. శ్వాసక్రియ తగ్గి నేల నుంచి ఎక్కువ పోషకాలు తీసుకోలేక పోయాయి. మొక్కల ఎదుగుదల లోపించింది. దీనికితోడు తెగుళ్ల తీవ్రత పెరిగింది. కలుపు సమస్య తీవ్రతరమైంది. ఇవన్నీ దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

సాగు విస్తీర్ణం 19,745 ఎకరాలు..

- జిల్లాలో ఈసారి 19,745 ఎకరాల విస్తీర్ణంలో రైతులు పత్తి సాగు చేశారు.
- ధర్మపురి, వెల్గటూర్, గొల్లపల్లి, కొడిమ్యాల మండలాల్లో అధికంగా పండిస్తున్నారు.
- ఆదిలోనే తెరిపి ఇవ్వకుండా వర్షాలు కురవడంతో పత్తి మొక్కలు ఎదగలేదు.
- కలుపుమొక్కలు బాగా పెరిగాయి. వాతావరణం అనుకూలిస్తే, ఎకరాకు 8 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని ఆశించినా.. కనీసం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.



పాశిగామలోని పత్తిచేనులో నిలిచిన వర్షపునీరు

- వర్షాలతో జిల్లాలో దాదాపు 500 ఎకరాల్లో పత్తికి నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమికంగా నివేదిక రూపొందించారు.
- కానీ, అంతకు మూడింతలు నష్టం జరిగిందని అన్నదాతలు అంటున్నారు.
- అంతేకాదు.. కలుపు మొక్కల తొలగింపు కోసం అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది.
- నల్లరేగడి నేలల్లో పత్తి సాగు చేయడంతో తెరిపిలేని వర్షాలతో నేల తడిసి ముద్దయ్యింది.
- ఇప్పుడు ఎలాంటి పనిచేసే పరిస్థితి లేదు.
- చివరకు చేనులో రసాయన ఎరువులు వేసే అవకాశం కూడా లేదని అంటున్నారు.

ప్రతిపాదనలకే పరిమితం..

జిల్లాలోని గోదావరి తీర ప్రాంత ధర్మపురి, వెల్గటూర్, బీర్‌పూర్, రాయికల్ మండలాలతోపాటు బుగ్గారం, గొల్లపల్లి మండలాల్లో ఎడతెరిపిలేని భారీవర్షాలతో పత్తికి బాగా నష్టం జరిగింది. ప్రకృతి వైపరీత్యాలకు దెబ్బతిన్న పంటలకు రూపాయి పరిహారం వచ్చిన దాఖలాలు లేవు. వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేసి, నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించడానికే సరిపోతోంది. నివేదికలపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపడం, స్థానిక ప్రజాప్రతినిధులు పరామర్శలకే పరిమితం కావడంతో అన్నదాతలు ఏటా నష్టపోతూనే ఉన్నారు.

గడ్డిమొక్కలే అధికం



నాకున్న ఎకరంన్నరలో పత్తి వేసిన. వర్షాలతో పత్తి కంటే కలుపు మొక్కలే ఎక్కువ పెరిగినయి. వాటిని తీసేందుకు కూలీల వెంట తిరిగినా దొరికే పరిస్థితి లేదు. మిగిలిన మొక్కలకు తెగుళ్ల బెడద ఎక్కువైంది.

– ఒరుపటి మల్లేశ్, పాశిగామ, వెల్గటూర్

భారీ వర్షాలతో ఇబ్బంది



భారీ వర్షాలతో పత్తి ఎదుగుదల లోపించింది. కలుపు మొక్కలు ఎక్కువయ్యాయి. ఈ ఏడాది దిగుబడి తగ్గే అవకాశం ఉంది. నిబంధనల మేరకు పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదిస్తున్నాం.

– సురేశ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి

సర్వాంగ సుందరంగా ధర్మపురి

- రూ.6.63 కోట్లతో అభివృద్ధి పనులు
- మంత్రి కొప్పుల ఈశ్వర్



మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి: సీఎం కేసీఆర్ సహాయ, సహకారాలతో పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతానని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. కలెక్టర్ యాస్మిన్‌బాషా, ఎస్పీ భాస్కర్‌తో కలిసి రూ.6.63 కోట్ల వ్యయంతో పట్టణంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు బుధవారం ఆయన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం, కేసీఆర్ సీఎం కావడంతో పట్టణం అభివృద్ధి చెందుతోందన్నారు. 2003లో శ్రీలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో సీఎం కేసీఆర్ యజ్ఞం చేశారని, ఈక్రమంలో ఇక్కడ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. అభివృద్ధి కోసం రూ.వంద కోట్లు మంజూరు చేశారని తెలిపారు. వాటితోనే వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని ఆయన చెప్పారు. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న రూ.4 కోట్ల వ్యయంతో నిర్మించిన సమీకృత మార్కెట్ అందుబాటులోకి రావడం సంతోషంగా ఉందని అన్నారు. చింతామణి చెరువు, సాయిబాబా టాకీస్ స్థానాల్లో సమీకృత మార్కెట్ నిర్మించామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దివాకర, డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఎంపీపీ చిట్టిబాబు, జెడ్పీటీసీలు బత్తిని అరుణ, బాదినేని రాజేందర్, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ రామన్న, కమిషనర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

గొల్లపల్లి(ధర్మపురి): దళిత పారిశుధ్య కార్మికుల హక్కులు కాలరాస్తూ, వెట్టిచాకిరీని ప్రోత్సహిస్తున్న సీఎం కేసీఆర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో కార్మికులు చేపట్టిన దీక్ష శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించి సంఘీభావం ప్రకటించారు. పారిశుధ్య కార్మికులతో నిత్యం 12 గంటల వరకు పనిచేయించుకుంటున్నా.. సమాన పనికి సమాన వేతనం చెల్లించడం లేదని విమర్శించారు. కార్మికుల హక్కుల సాధనకు అండగా నిలుస్తామని ఎమ్మెల్సీ భరోసా ఇచ్చారు. ఆయన వెంట కార్మికులు, నాయకులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించేలా చర్యలు

జగిత్యాలటౌన్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలు పరిష్కరించేలా చూస్తానని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు స్థానిక ఇందిరాభవన్‌లో ఆయనను కలిసి విజ్ఞప్తి చేయగా జీవన్‌రెడ్డి స్పందించారు. ఆయనను కలిసిన వారిలో దయావతి, నీలవేణి, రజని, శివప్రియ, మాధవి, కళావతి, అంజమ్మ ఉన్నారు. అదేవిధంగా తమ సమస్యలు పరిష్కరించాలని సమగ్రశిక్షా అభియాన్ ఉద్యోగులు ఒక వినతిపత్రం అందజేశారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు!

- రుణమాఫీకి లైన్‌క్లియర్
- ఉమ్మడి జిల్లాలో 3.49 లక్షల మందికి లబ్ధి



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: సుదీర్ఘ నిరీక్షణ అనంతరం అన్నదాతల ఆశలు ఫలించాయి. లక్షలోపు రుణమాఫీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించగా సదరు ప్రక్రియ నాలుగేళ్ల అనంతరం తుదిదశకు చేరుకోవడం గమనార్హం. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రధానమైంది సాగురంగమే. ఉభయ గోదావరి జిల్లాలతో పోటీపడే ఉమ్మడి కరీంనగర్‌ది ప్రత్యేక ముద్ర. ప్రధానంగా వరి, పత్తి, మొక్కజొన్న, పసుపు, చెరుకు పంటలకు ప్రసిద్ధి కాగా చిన్న, సన్నకారు రైతులే ఎక్కువ. ఈక్రమంలో బ్యాంకు రుణంతోనే ఏటా రెండు పంటలను సాగు చేస్తుంటారు. అయితే అతివృష్టి లేదా అనావృష్టి అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తుండగా దిగుబడులు ఒక్కోసారి దిగదుడుపే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రకటించే రుణమాఫీ ప్రకటనే రైతులకు ఒకింత ధైర్యాన్నిస్తుండగా మాఫీ అమలు ఆగుతూ సాగింది. 2018 డిసెంబర్ 11వరకు రూ.లక్షలోపు రుణం తీసుకున్న రైతులకు రుణమాఫీ ప్రకటించగా ఉమ్మడి జిల్లాలో 3,49,474 మంది లబ్ధి చేకూరనుంది. రూ.1200 కోట్ల మేర రుణమాఫీ జరగనుంది.

ఆగుతూ సాగిన ప్రక్రియ

టీఆర్ఎస్ ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించగా నాలుగు విడతలుగా మాఫీ చేస్తామని గతంలో ప్రకటించింది. రూ.25 వేలలోపు రుణం తీసుకున్న రైతులకు ఒకసారి, రూ.50 వేలలోపు మరోసారి, రూ.75 వేలు, రూ.లక్ష చివరిసారి.. ఇలా నాలుగు విడతలుగా మాఫీ ఇలా 2019లోనే సదరు ప్రక్రియ పూర్తికావాలి. కానీ.. కేవలం రూ.25 వేల లోపు రుణం తీసుకున్నవారికి మాత్రమే మొదటి విడత మాఫీ చేశారు. ఆ తర్వాత మిగతా ప్రక్రియ ఆగిపోయింది. ఓసారి సమాచారం సేకరించడం మళ్లీ అటకెక్కించడం చేశారు. మొదటి విడతలో కరీంనగర్ జిల్లాలో 15,200 మంది లబ్ధిపొందగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో 4,663, పెద్దపల్లి జిల్లాలో 14,636, జగిత్యాల జిల్లాలో 27 వేల మందికి మాత్రమే రుణమాఫీ జరిగింది.

వడ్డీ డబ్బులు తిరిగొచ్చేనా?

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కర్షకులు రుణమాఫీ కోసం నిరీక్షిస్తున్నారు. ప్రభుత్వం నాలుగు విడతల్లో మాఫీ చేస్తుందని ప్రకటించడంతో చాలామంది రుణాలు తిరిగి చెల్లించలేదు. వడ్డీ డబ్బులు కడుతూ వచ్చారు. మొత్తంగా రూ.400 కోట్ల వరకు వడ్డీ చెల్లించినట్లు సమాచారం. ధాన్యం డబ్బులు ఖాతాలో జమైతే చాలు బ్యాంకర్లు వాటిని రుణానికి మిత్తికింద జమచేశారు. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల్లో 50 శాతానికి పైగా రైతులది ఇదే పరిస్థితి. 2019లోనే పూర్తిగా రుణమాఫీ జరగాల్సి ఉండగా నాలుగేళ్లుగా వడ్డీ డబ్బులు చెల్లించి రెన్యువల్ చేసుకున్నారు. ఈ క్రమంలో సదరు డబ్బులు కూడా రైతుల ఖాతాలో జమచేయాలని డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే మాఫీ చేసినా పెద్దగా రైతులకు ఒరిగిందేమి లేదని అభిప్రాయపడుతున్నారు. కరీంనగర్ జిల్లాలో 76,791 మందికి ఇంకా రుణమాఫీ కావాల్సి ఉండగా రాజన్న సిరిసిల్లలో 57,210 మంది, పెద్దపల్లిలో 78,064 మంది, జగిత్యాల జిల్లాలో 76 వేల మంది రైతులు ఇప్పటికీ రెన్యువల్ కింద వడ్డీ చెల్లిస్తూ రుణాలు తీసుకుంటున్నారు.

జిల్లాలవారీగా రుణమాఫీ ఇలా..

జిల్లా	అర్హులు	మొదటివిడత మాఫీ	ఇంకా కావాల్సినవారు
కరీంనగర్	91,991	15,200	76,791
రాజన్నసిరిసిల్ల	61,783	4,663	57,210
పెద్దపల్లి	92,700	14,636	78,064
జగిత్యాల	1,03,000	27,000	76,000

రైతుబాంధవుడు సీఎం కేసీఆర్



దేశంలో ఏ రాష్ట్రం చేపట్టని విధంగా, రైతాంగ అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ తీవ్రంగా కృషి చేస్తున్నారు. రుణమాఫీకి కార్యాచరణ రూపొందించడంపై కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నా. కరోనా వంటి విపత్కర పరిస్థితులు, ఎఫ్ఆర్బీఎం పరిమితులు, నోట్ల రద్దు, జీఎస్టీ వంటి కేంద్ర అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్ర ఆదాయం పడిపోయినా తెలంగాణలో రైతుల కోసం నిరంతరాయంగా కృషి చేస్తున్నారు. నేడు రూ. 19వేల కోట్ల భారాన్ని భరిస్తూ తీసుకున్న రైతు రుణమాఫీ నిర్ణయం విప్లవాత్మకం. ఇవే కాకుండా రైతుబంధు, రైతుబీమా, ఉచిత కరెంట్, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, కాళేశ్వరం జలాలతో రాష్ట్రాన్ని ధాన్యాగారంగా తీర్చిదిద్దారు.

– గంగుల కమలాకర్, బీసీ సంక్షేమశాఖ మంత్రి

క్లుప్తంగా

తాళంవేసిన ఇంట్లో చోరీ



చిందరవందరగా బీరువాలోని వస్తువులు

ధర్మపురి : పట్టణంలో పదిరోజుల క్రితం జరిగిన దొంగతనం మరువకముందే మరో దొంగతనం జరగడంతో పట్టణవాసులు భయందోళన చెందుతున్నారు. ధర్మపురిలోని గోదావరి రూట్‌లోని బ్రాహ్మణ వీధిలో ఉంటున్న సంగనభట్ల చిన్న రామకిష్టయ్య పదిరోజుల క్రితం తిరుపతికి వెళ్లారు. బుధవారం రామకిష్టయ్య ఇంటికి రాగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువాలోని వస్తువులు చిందరవందరగా ఉండటంతో పాటు రూ.7వేల నగదును చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపాడు.

రెండు ఆలయాల్లో..

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండ, ఇబ్రహీంపట్నం హనుమాన్ ఆలయాల్లో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. వర్షకొండలోని హనుమాన్ ఆలయంలో ఆలయ తాళం పగులకొట్టి అర్ధతులం వెండి ఆభరణాలు, పగులకొట్టి సుమారు రూ.10వేల నగదు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. మండలకేంద్రంలోని పంచముఖ హనుమాన్ ఆలయంలో హుండీ తాళం పగులకొట్టి సుమారు రూ. 10వేల నగదు, ఇత్తడి గంటను ఎత్తుకెళ్లినట్లు చెప్పారు. మంగిలిపెల్లి లక్ష్మణ్, ఇబ్రహీంపట్నం పంచముఖ ఆలయ అర్చకులు నవీన్ చార్యులు ఫిర్యాదు మేరకు ఎస్సై ఉమాసాగర్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి చేస్తున్నారు.

దిష్టిబొమ్మ దహనం



జగిత్యాలటౌన్ : పూజల కోసం ఆలయానికి వెళ్లిన హిందూ భక్తులపై జీహాదీ మూకల దాడులను విశ్వహిందూ పరిషత్ పక్షాన ఖండిస్తున్నామని జిల్లా అధ్యక్షుడు పద్మాకర్ అన్నారు. హర్యానాలోని మేవత్‌లో హిందూ భక్తులపై జీహాదీ మూకల దాడులను నిరసిస్తూ బుధవారం జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో జీహాదీల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తులపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. వీహెచ్‌పీ జిల్లా సహ కార్యదర్శి గాజోజు సంతోష్, ప్రచార ప్రముఖ్ బెజ్జంకి సుభాష్, కోశాధికారి రాములు, పట్టణ అధ్యక్షుడు జిట్టవేణి అరుణ్, నగర కార్యదర్శి నరేందర్ రాజు, తవుటు రాంచంద్రం, గంగాధర్, భారత్ సురక్షా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు, జిల్లా అధ్యక్షుడు కాశీనాథం తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల్లేవ్.. కాపీలు లేవ్

కోరుట్ల: 'సార్..మా పుస్తకాలు, బ్యాగులు, పెద్దవాగు వరదనీటిలో కొట్టుకుపోయాయి. బడికి ఎట్ల పోవాలే.. అందుకే మూడు రోజుల నుంచి మేం బడికి పోతలేం'..అని కోరుట్లలోని గంగంపేటలో ఉండే ఆరో తరగతి విద్యార్థి ఆవేదన. ఈ సమస్య ఒక రిద్దరు పిల్లలదే కాదు. కోరుట్లలో వరద తాకిడికి కొట్టుకెళ్లిన సుమారు 120 ఇళ్లకు చెందిన 80 మంది చిన్నారుల దుస్థితి. పిల్లలంతా అదే ఏరియాలో ఉండే ఉర్దూ మీడియం పాఠశాలలో చదువుతున్నారు.



- వరద ప్రవాహానికి కొట్టుకెళ్లిన పుస్తకాలు, నోట్‌బుక్స్
- మూడు రోజులుగా బడికి దూరం
- ఇంట్లో చేరిన బురదను తీస్తున్న చిన్నారులు
- గంగంపేటలోని చిన్నారుల దుస్థితి

ఇండ్లలో బురద తీస్తూ..

పాఠశాలకు వెళ్లేందుకు అవసరమైన పుస్తకాలు, నోట్‌బుక్స్ లేకపోవడంతో గంగంపేట ఉర్దూ మీడియం విద్యార్థులు ఇళ్లల్లోనే ఉంటున్నారు. తల్లిదండ్రులతో కలిసి వరద నీటితో ఇళ్లలో చేరిన బురదను తొలగిస్తూ, సామన్లు సర్దుతూ కాలం గడుపుతున్నారు. వరద తీవ్రత తగ్గి మూడు రోజులైనా ఆ ఏరియాలోని ప్రజలు తమ ఇళ్లలో ఏ సామన్లు ఉన్నాయో..ఏవి కొట్టుకెళ్లాయో అని వెతుకుతూనే ఉన్నారు. పిల్లల బ్యాగులు, నోట్‌బుక్‌లు, పుస్తకాలు ఏమీ మిగల్లేదు. ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు గంగంపేటలో పర్యటించిన సందర్భంగా పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలు స్కూల్ వెళ్లేందుకు పుస్తకాలు లేవని ఆవేదన వ్యక్తం చేయగా విద్యాశాఖ అధికారులతో మాట్లాడి చిన్నారులకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

యువత చేయూత

పుస్తకాలు, నోట్‌బుక్స్ వరద నీటిలో కోల్పోయిన కొంతమంది పిల్లలకు గంగంపేటకు చెందిన యువజన సంఘాల నాయకులు నోట్‌బుక్స్ అందజేశారు. ఒక్కొక్కరికి ఉపాధ్యాయులు చెప్పే నోట్స్ రాసుకోవడానికి కనీసం పది నోట్‌బుక్స్ అవసరమని విద్యార్థులు చెబుతున్నారు. నోట్‌బుక్స్ స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్నప్పటికీ పాఠ్య పుస్తకాలు విద్యాశాఖ నుంచి రావాల్సి ఉంటుంది. వరద నీటిలో పుస్తకాలు కోల్పోయిన పిల్లలందరికీ విద్యాశాఖ ఆధ్వర్యంలో పుస్తకాలు అందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

వరదలో కొట్టుకెళ్లాయ్



ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరదలో బ్యాగు, పుస్తకాలు, నోట్ బుక్స్ అన్నీ కొట్టుకెళ్లాయి. ఇప్పుడు పాఠశాలకు వెళ్లాలంటే నా వద్ద ఏమీలేవు. అందుకే రెండ్రోజులనుంచి స్కూల్‌కు వెళ్లడం లేదు.

– నాసర్, ఆరో తరగతి, ఉర్దూ మీడియం, గంగంపేట

పుస్తకాలు ఎక్కడున్నయో



మా ఇల్లు మొత్తం బురదతో నిండిపోయింది. నా పుస్తకాలు ఉన్నాయో పోయాయో తెలుస్తలేదు. అన్ని సామన్లు సర్దినం. కానీ పుస్తకాలు కనిపిస్త లేవు. ఒకటి రెండు ఉన్నా.. తడిసిపోయినయ్. బడికి పోతలేను. ఇంట్లోకి చేరిన బురద ఎత్తిపోస్తున్నాం.

– అర్షన్, ఐదో తరగతి, గంగంపేట, ఉర్దూ మీడియం పాఠశాల

పిల్లలకు పుస్తకాలు ఇవ్వాలి



పిల్లలు పుస్తకాలు లేక బడికి పోతలేరు. మొన్న కురిసిన వర్షాలకు పుస్తకాలన్నీ కొట్టుకుకెళ్లినయ్. వాడకట్టు యూత్ పిల్లలు కొందరు నోట్‌బుక్‌లు ఇచ్చిండ్రు. కానీ చదువుకునే పుస్తకాలు లేవు. బడి సార్లు కొత్త పుస్తకాలు ఇస్తే మంచిగుంటుంది.

– సబీరా, గంగంపేట, కోరుట్ల

కన్నకొడుకే కాలయముడు

- భూమికోసం తల్లిని చంపిన తనయుడు



కనుకవ్వ (ఫైల్)



మృతదేహం వద్ద రోదిస్తున్న కూతురు

తిమ్మాపూర్(మానకొండూర్): కన్న కొడుకే కాలయముడయ్యాడు. నవమాసాలు మోసి, కని, పెంచిన తల్లి తమ్మనవేణి కనుకవ్వ(60)ను భూమికోసం దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటన కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం జంగపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామానికి చెందిన తమ్మనవేణి కనుకవ్వ(60)కు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు వినోద్ ఉన్నాడు. భర్త గతంలోనే చనిపోవడంతో అన్నీతానై పిల్లలను సాకి ప్రయోజకులను చేసింది. కూతుళ్లు, కుమారుడి వివాహాలు చేసింది. భర్త తరఫున వచ్చిన ఎకరం భూమిని తన కొడుకు వినోద్ పేరిట రిజిస్ట్రేషన్ చేసింది. తనతల్లిగారి తరఫున వచ్చిన రెండెకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ చిన్నకూతురుతో కలిసి ఉంటోంది. కొద్దిరోజులుగా తల్లిగారిల్లు రేణికుంటలో ఒక్కతే అద్దెకు ఉంటోంది.

రెండెకరాలపై కన్నేసి..

తండ్రి తరఫున వచ్చిన ఎకరం తీసుకున్న కొడుకు వినోద్.. కనుకవ్వ పుట్టింటివారు ఇచ్చిన భూమి కూడా తనకే కావాలని రెండేళ్లుగా గొడవ పడుతున్నాడు. అది కూతుళ్లకు ఇస్తుందనే అనుమానంతో గతేడాది పంటలు వేయకుండా అడ్డుకున్నాడు. అయినా తల్లి భూమి రిజిస్ట్రేషన్ చేయలదు. దీంతో ఈ ఏడాది బలవంతంగా భూమి లాక్కుని, కౌలుకు ఇచ్చాడు. దీంతో గొడవలు పెద్దవయ్యాయి.

గండ్లు పూడ్చేందుకు వెళ్లి..

ఇటీవల కురిసిన వర్షాలకు వరద పోటెత్తడంతో జంగపల్లి శివారులోని వ్యవసాయ భూమిలో గండ్లుపడ్డాయి. వాటిని పూడ్చేందుకు వినోద్ బుధవారం ఉదయం వెళ్లాడు. ఈ విషయం తెలుసుకున్న కనుకవ్వ కూడా పొలం వద్దకు వెళ్లింది. తన భూమిలో ఎందుకు సాగు చేస్తున్నావని కొడుకును అడిగింది. ఈక్రమంలో ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. ఆవేశానికి లోనైన వినోద్.. తన చేతిలోని పారతో తల్లి తలపై బలంగా కొట్టాడు. దీంతో కనుకవ్వ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే కుప్పకూలి మృతిచెందింది. కూతుళ్ల ఇచ్చిన సమాచారం మేరకు తిమ్మాపూర్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎల్ఎండీ, గన్నేరువరం ఎస్సైలు ప్రమోద్‌రెడ్డి, నర్సింహారావు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. వినోద్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తిమృతి



హరినాయక్ మృతదేహం



విచారణ చేపట్టిన ఎస్సై నవీన్‌కుమార్

మల్లాపూర్ : గోదావరిలో చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందడంతో గ్రామంలో ఉద్రిక్తతో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వాల్గొండ గ్రామానికి చెందిన గుగ్లావత్ హరినాయక్ (47) కు భార్య ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. కుమార్తెలకు వివాహం కాగా కుమారుడు నాగరాజు తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. హరినాయక్ కొంతకాలంగా రాయికల్‌కు చెందిన ఇషాక్ వద్ద కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గతనెల 30న గొర్రెపల్లి శివారులోని గోదావరి నదిలో చేపలు పట్టేందుకు ఇషాక్ పిలవడంతో హరినాయక్ వెళ్లాడు. బుధవారం వేకువజామున హరినాయక్ అస్వస్థతకు గురికావడంతో అక్కడే కూలీ పనిచేస్తున్న వాల్గొండ గ్రామానికి చెందిన కల్లెడ రాజేందర్ ఇషాక్‌కు సమాచారం ఇచ్చాడు. హుటాహుటినా ఇషాక్ అక్కడికి చేరుకొని హరినాయక్‌ను రాజేందర్ సహకారంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. విషయాన్ని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చిన ఇషాక్ మృతదేహాన్ని వాల్గొండకు తరలించారు. కుటుంబ సభ్యులు రోడ్డుపైనే మృతదేహం ఉంచడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఎస్సై నవీన్ కుమార్ సిబ్బందితో వాల్గొండకు చేరుకొని విచారణ చేపట్టారు. మల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ లక్ష్మీ నారాయణ, ఎస్సై నవీన్‌కుమార్‌తో కలిసి హరినాయక్ కుటుంబ వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. హరినాయక్ అనుమానస్పదంగా మృతిచెందాడని, తమకు న్యాయం చేయాలని కోరారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మిషన్ భగీరథ దేశానికే ఆదర్శం



నీటి సరఫరా ప్రారంభిస్తున్న విద్యాసాగర్‌రావు

మెట్‌పల్లి(కోరుట్ల): మిషన్ భగీరథ పథకం దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. స్థానిక మండల పరిషత్ స్థలంలో భగీరథ నిధులు వెచ్చించి నిర్మించిన వాటర్ ట్యాంకుల నుంచి బుధవారం నీటి సరఫరా ప్రారంభించి మాట్లాడారు. సుమారు రూ.36కోట్ల వ్యయంతో పట్టణంలో భగీరథ పనులు చేపట్టామన్నారు. చేపట్టడం జరిగిందన్నారు. రాబోయే కొద్దిరోజుల్లోనే ప్రతీ ఇంటికి నల్లాల ద్వారా మంచినీరు సరఫరా చేస్తామని చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత, ఎంపీపీ మారు సాయిరెడ్డి, వైస్‌చైర్మన్ చంద్రశేఖర్‌రావు, కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, డీఈ సంపత్‌కుమార్, ఏఈ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం వెల్లుల్ల రోడ్డు– పోలీస్‌స్టేషన్ మధ్య చేపట్టిన బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు.

నియామకం



వినోద్‌కుమార్‌ను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు

ధర్మపురి : పట్టణ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు లీగల్ ఎయిడ్ కౌన్సిల్ అలుక వినోద్‌కుమార్‌ను రాష్ట్ర లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్‌గా నియమించినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం సత్యనారాయణ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినోద్‌కుమార్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాదులు రౌతు రాజేశ్, రామడుగు రాజేశ్, అప్పాల నిరంజన్, జాజాల రమేశ్, బత్తిని ఇంద్రకరణ్, తదితరులున్నారు.

సంఘ సేవకుడికి అవార్డు



అవార్డు అందుకుంటున్న మున్ను

రాయికల్(జగిత్యాల): పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు మహ్మద్ ముస్తాక్ అహ్మద్ (మున్ను) బుధవారం ఉత్తమ సంఘ సేవకుడి అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లోని అల్లూరి కల్చరల్ సోషల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు పురస్కారం అందజేశారు. ఆయనను పలువురు అభినందించారు.

విదేశీ ఉద్యోగాల కోసం పేర్ల నమోదు

- టామ్‌కామ్ ఆధ్వర్యంలో నిర్వహణ
- ఈనెల 5న వరంగల్‌లో నమోదు

జగిత్యాలటౌన్: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్‌కామ్) ఆధ్వర్యంలో విదేశీ ఉద్యోగాల కోసం ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి బి.సత్యమ్మ తెలిపారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆస్ట్రేలియా దేశంలోని మైనింగ్, ఇండస్ట్రియల్ ప్లాంట్‌లో మెకానిక్, మెకానికల్ ఫిట్టర్, మెకానికల్ ఇంజినీర్, కన్వేయర్ బెల్ట్ టెక్నీషియన్, మిషనిస్ట్, వెల్డర్, బాయిలర్ మేకర్, ఫ్యాబ్రికేటర్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. జర్మనీ దేశంలో మీట్ ప్రాసెసింగ్, ఫుడ్ రిటైల్ సేల్స్ కన్‌స్ట్రక్షన్, సాంకేతిక రంగ ఎలక్ట్రానిక్స్, మెటల్ బిల్డర్, మోడల్ బిల్డర్ ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. 60శాతం మార్కులతో ఇంటర్ లేదా ఐటీఐ లేదా గ్రాడ్యుయేషన్ కలిగిఉన్నవారు అర్హులని వివరించారు. అనుభవం అవసరం లేదని స్పష్టం చేశారు. వరంగల్ ములుగు రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐలో ఆగస్టు 5న పేర్ల నమోదు ప్రక్రియ ఉంటుందన్నారు. మరిన్ని వివరాల కోసం టామ్‌కామ్, మొబైల్ నంబర్లు 97017 32697, 78935 66493 లేదా www.otmcom.telangana.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని కోరారు.

10 నుంచి పోషక విలువలతో కూడిన బియ్యం

- జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్

జగిత్యాలరూరల్: జిల్లాలో ప్రతినెలా చౌకధరల దుకాణం ద్వారా ఇచ్చే రేషన్ బియ్యం కిలోకు రూపాయి చొప్పున పంపిణీ చేస్తున్నామని, ప్రభుత్వ నిర్ణయం మేరకు రాష్ట్రంలో మొదటిసారిగా పోషక విలువలతో కూడిన బియ్యం ఆగస్టులో ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్ పేర్కొన్నారు. ఈనెల 10నుంచి రేషన్ షాపుల్లో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

జగిత్యాల: ఆగస్టు 6లోపు గ్రూప్–3 పరీక్ష ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి సాయిబాబా తెలిపారు. రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్ మైనార్టీల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గ్రూప్–3 పరీక్షకు దరఖాస్తు చేసుకున్న మైనార్టీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 94414 60325 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

గడువు పొడిగింపు..

యూపీఎస్సీ సీఏసీటీ పరీక్షల శిక్షణ కోసం మైనార్టీ అభ్యర్థుల దరఖాస్తు గడువును ప్రభుత్వం ఈనెల 13 వరకు పొడిగించిందని మైనార్టీ సంక్షేమాధికారి సాయిబాబా పేర్కొన్నారు. మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా యూపీఎస్సీ సీఎస్ఏటీ–2024 పరీక్షకు వందమంది మైనార్టీ అభ్యర్థుల కోసం ఉచిత శిక్షణనిచ్చేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మైనార్టీ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్క్రీనింగ్ టెస్ట్ ఉదయం 10 నుంచి 12 గంటల వరకు జిల్లాలోని మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో నిర్వహించనున్నట్లు చెప్పారు.

మద్యం దుకాణాల టెండర్లకు దరఖాస్తులు

జగిత్యాలక్రైం: రాష్ట్ర ప్రభుత్వం మద్యం దుకాణాల టెండర్లకు మహూర్తం ఖరారు చేసింది. గతంలో టెండర్ దక్కించుకున్న వారికి 2023 నవంబర్ 30 వరకు సమయం ఉన్నా ప్రభుత్వం రెండునెలల ముందుగానే టెండర్లకు బుధవారం నోటిఫికేషన్ జారీచేసింది. దీంతో జిల్లాలో 71 మద్యం దుకాణాలకు టెండర్లు వేసేందుకు ఎక్సైజ్ శాఖ అధికారులు కసరత్తు పూర్తిచేశారు. 2023–25 సంవత్సరానికి గాను మద్యం వ్యాపారులు టెండర్లు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. గతంలో 71 షాపులకు టెండర్ కోసం దరఖాస్తులు కోరగా, 1471 దరఖాస్తులు రాగా, 29.42 కోట్ల ఆదాయం వచ్చింది.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేట గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయం వద్ద గల వ్యవసాయ బావిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. బ్లూ కలర్ టీషర్ట్, గోధుమరంగు ప్యాంట్ ధరించాడని, వివరాలకు 8712656506, 8712656507లో నంబర్లలో సంప్రదించాలన్నారు.

వేగంగా అభివృద్ధి పనులు



పనులు ప్రారంభిస్తున్న సంజయ్

జగిత్యాల: అభివృద్ధి పనులను వేగంగా చేయాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సూచించారు. నూకపల్లి డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కాలనీలో 520 ఇళ్లకు రూ. 49.14 లక్షల వ్యయంతో చేపట్టిన విద్యుత్ పనులను బుధవారం ప్రారంభించి మాట్లాడారు. మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, డీఈ రాజేశ్వర్ పాల్గొన్నారు.

గ్రామాల సమగ్రాభివృద్ధికి పెద్దపీట

జగిత్యాలరూరల్: గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. వంజరిపల్లిలో రూ.20 లక్షల వ్యయంతో చేపట్టిన గ్రామపంచాయతీ భవనం, రూ.15 లక్షలు వెచ్చించి చేపట్టిన సీసీరోడ్డు, డ్రైనేజీలకు ఆయన భూమిపూజ చేసి మాట్లాడారు. అడిషనల్ కలెక్టర్ దివాకర, సర్పంచ్ రజిత, ఎంపీటీసీ మహేశ్, ఎంపీడీవో రాజేశ్వరి, ఎంపీవో రవిబాబు, ఏఈ రాజమల్లయ్య పాల్గొన్నారు.

మరమ్మతులు చేపట్టాలి

- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

కథలాపూర్(వేములవాడ): వర్షాలతో దెబ్బతిన్న చెరువులను, రోడ్లను త్వరగా మరమ్మతులు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఆది శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బీమారం మండలం రాజలింగంపేట శివారులో వరదకు తెగిన గోవిందరాజుల చెరువును పరిశీలించారు. కూలిన పౌల్ట్రీ ఫాంను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వరదలో చిక్కుకున్నవారిని కాపాడిన యువకులను అభినందించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలతో కోతకు గురైన రోడ్లకు మరమ్మతులు చేయించి రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. ఇక్కడ పార్టీ మండలాధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, నాయకులు ఏనుగు రమేశ్ రెడ్డి, పుప్పాల కొమురయ్య, ఉరుమడ్ల లక్ష్మణ్, విజయ్‌కుమార్, తేలు బాషా, ఆదిరెడ్డి, తదితరులున్నారు.

పారదర్శకంగా వాహనాల వేలం

- డీఎస్పీ వెంకటస్వామి



వేలం నిర్వహిస్తున్న పోలీసులు

జగిత్యాలక్రైం: వివిధ పోలీస్‌స్టేషన్లలో పట్టుబడిన వాహనాలను యజమానులు తీసుకెళ్లకపోవడంతో పారదర్శకంగా వాహనాలను వేలం వేసినట్లు డీఎస్పీ వెంకటస్వామి తెలిపారు. జిల్లా పోలీస్ ట్రాఫిక్ శిక్షణ కేంద్రంలో వివిధ కేసుల్లో పట్టుబడి తీసుకెళ్లని వాహనాలను వేలం ద్వారా 70 వాహనాలను 9 స్లాట్లుగా విభజించి వేలం నిర్వహించినట్లు తెలిపారు. మొత్తం వాహనాలకు రూ.7.40 లక్షలు వచ్చాయని, వేలం నిర్వహణ ద్వారా వచ్చిన డబ్బులు ప్రభుత్వ ఖాతాలో జమచేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ వేణు, ఆర్ఎస్సై కృష్ణ, వినోద్‌రెడ్డి, వేలం దారులు పాల్గొన్నారు.

హోటళ్లలో శుభ్రత పాటించాలి



జరిమానా విధిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్

జగిత్యాల: హోటళ్లలో శుభ్రత పాటించకపోయినా, వినియోగదారులకు నాణ్యమైన పదార్థాలు అందించపోకపోతే చర్యలు తీసుకుంటామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బార్ అండ్ రెస్టారెంట్లు, హోటల్స్ తనిఖీ చేశారు. ప్లాస్టిక్ వినియోగిస్తున్నా, శుభ్రత లేని హోటల్స్‌పై జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగించవద్దన్నారు. తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట సిబ్బంది అశోక్ ఉన్నారు.